క్లుప్తంగా

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): స్థానిక షిరిడీ సాయి ఆలయంలో గురువారం ఆలయ అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో భక్తులు సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, పలు రకాల అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎంతో మహిమ కలిగిన షిరిడీ సాయిబాబాని పూజిస్తే తాము కోరిన కోరికలు నెరవేరుతాయనే భావంతో పల్నాడు జిల్లాలోని అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయం చెందారు. దుర్గిమార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు వెన్నా వెంకటేశ్వరరెడ్డి, వెంకటలక్ష్మి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యులు నవులూరి భాస్కర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి కె.రంగ నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఆవుల జనార్దన్‌రావు



పిడుగురాళ్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల 2025–26 ఏడాదికి గాను నూతన కార్యవర్గాన్ని పల్నాడు జోనల్ చైర్మన్ టంగుటూరి సతీష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఆవుల జనార్దన్‌రావు, సెక్రటరీగా కోడూరి కాశీ శంకర్, ట్రెజరర్‌గా శిష్ట్ల పట్టాభిలను ఏన్నుకున్నారు. ఈ నెల 24వ తేదీన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 316 గవర్నర్ సీహెచ్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతుందని జోనల్ చైర్మన్ టంగుటూరి సతీష్ తెలిపారు.

'ఫాతిమా' కళాశాల సందర్శన



దాచేపల్లి: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంపై అవగాహనలో భాగంగా గురువారం దాచేపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో జూనియర్ మరియు సీనియర్ విద్యార్థులు ఫాతిమా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాలను సందర్శించారు. సీనియర్ ఫ్యాకల్టీ సభ్యుల ద్వారా ఐటీ రంగ ప్రాముఖ్యతపై విలువైన సమాచారం అందించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పరిశ్రమల పరిజ్ఞానం, భవిష్యత్తు అవకాశాలపై స్పష్టత కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ భగవాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనాలు చెల్లించాలి



దాచేపల్లి: రాష్ట్రవ్యాప్తంగా మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజాన్లకు ప్రభుత్వం వెంటనే గౌరవ వేతనాలు చెల్లించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాచేపల్లి నగర పంచాయతీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షేక్ సైదా గురువారం డిమాండ్ చేశాడు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతినెల క్రమం తప్పకుండా వారికి గౌరవ వేతనాలను చెల్లించారన్నారు. ఇమామ్, మౌజాన్ల ఆత్మగౌరవాన్ని పెంచేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేసిందని సైదా గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మౌజన్, ఇమామ్ లకు గౌరవ వేతనాలను పెంచడంతోపాటుగా ప్రతినెల క్రమం తప్పకుండా చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, కానీ ఏడాదిన్నరగా వారికి ఒక్క రూపాయి చెల్లించలేదన్నారు. ప్రభుత్వం వెంటనే వారికి గౌరవ వేతనాలను విడుదల చేయాలని సైదా డిమాండ్ చేశారు.

జారిపడి ప్రభుత్వ ఉద్యోగి మృతి



నరసరావుపేట టౌన్: ప్రమాదవశాత్తు జారి పడి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతూరు పెరుగు మార్కెట్ వీధిలో నివాసం ఉంటున్న బండారు వెంకటస్వామి (41) పల్నాడు జిల్లా డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంట్లో స్నానం చేస్తుండగా జారి పడ్డాడు. ఈ సంఘటనలో తలకు బలమైన గాయం తగిలింది. క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తూ మూడు నెలల క్రితం బదిలీపై వెంకటస్వామి పల్నాడు జిల్లాకు వచ్చాడు. భార్య, ఇద్దరు పిల్లలు గుంటూరులోనే నివాసం ఉంటుండగా వెంకటస్వామి సహచర ఉద్యోగితో రూంలో ఉంటూ ప్రమాదవశాత్తు జారీ పడి మృతి చెందాడు.

అరకొర బస్సులు.. అంతులేని కష్టాలు



బస్సులో సీట్లు లేక గంటల తరబడి నిలబడే ప్రయాణం



పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు సర్కసు ఫీట్లు

అసలే అరకొర బస్సులు.. ఉన్నకొద్ది వాటిని సైతం అనంతపురం సభకు తరలించడంతో.. అవి ఇంకా డిపోలకు చేరక ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గంటలకొద్దీ ఎదురుచూస్తే వచ్చేది ఒక్క బస్సు.. ఆ బస్సులోనే రెండు బస్సులకు సరిపడా ప్రయాణికులు ఎక్కాల్సిన దుస్థితి. పిడుగురాళ్ల నుంచి గ్రామాలకు, గుంటూరు, విజయవాడ, మాచర్ల వెళ్లే బస్సులు లేక, ఉన్న ఒకటీ అరా కిక్కిరిసిపోతుండడంతో ప్రయాణికుల కష్టాలు అన్నీఇన్నీకావు. – పిడుగురాళ్ల

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాచర్ల రూరల్: హామీలను అమలు చేయకుండా ఉద్యోగులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన సమయంలో బుద్ధి చెబుతామని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ కృష్ణారావు గురువారం హెచ్చరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర దాటుతున్నా ఉద్యోగులకు ఇస్తామన్న డీఏలు, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, ఐఆర్ ప్రకటన, సీపీఎస్ రద్దు, మెమో 57 అమలు వంటి డిమాండ్లను అమలు చేయకుండా కాలయాపన చేస్తూన్న ప్రభుత్వ విధానం పై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు చెల్లింపు పరిమితి రూ.25లక్షలకు పెంపు,



నల్లరిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

యాప్‌లు, అసైన్‌మెంట్, బుక్లెట్ విధానం రద్దు వంటి సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు పిచ్చయ్య, ఆంజనేయులు, కెనడి, జాన్, ఆచారి తదితరులున్నారు.

వేర్వేరు ఆటల పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక



వాగ్దేవి విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు



కే-రిడ్జి విద్యార్థినులను అభినందిస్తున్న నాతాని

నరసరావుపేట ఈస్ట్:ఫ్లోర్‌బాల్ జాతీయ జట్టుకు కే-రిడ్జి విద్యార్థిని జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో కే-రిడ్జి విద్యార్థులు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ గురువారం తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని ముజాఫర్‌పూర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి అండర్–14 బాలిక విభాగంలో ఏపీ జట్టు తృతీయస్థానం సాధించిందని వివరించారు. ఏపీ జట్టుకు తమ విద్యార్థిని ఎన్.హంసిని కెప్టెన్‌గా వ్యవహరించగా, బి.యశస్విని, ఎస్.లీల లోహిత గెలుపులో కీలకపాత్ర పోషించారని తెలిపారు. కాగా, ఫ్లోర్‌బాల్ జాతీయ జట్టుకు తమ విద్యార్థిని లీలా లోహిత ఎంపికైందని, త్వరలో సింగపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ ఫోర్‌బాల్ అండర్–14 బాలికల పోటీలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.కిషోర్‌బాబు, పి.మహిత, శేషగిరి అభినందించారు.

ఆట్యా–పాట్యా జట్టుకు వాగ్దేవి విద్యార్థులు

పల్నాడు జిల్లా ఆట్యా–పాట్యా బాలబాలికల జట్టుకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలో బాలికల విభాగంలో బి.సౌజన్య, షేక్.నజ్మా, పి.తిరుపతమ్మ, కె.లక్ష్మీసరిత, పి.స్రవంతి, బాలుర విభాగంలో కె.శ్రీనివాసరావు, కె.తినాథ్ ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్ కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, అభినందించారు.

సద్ది ఏర్పాటులో దాతల చొరవ అభినందనీయం

నాదెండ్ల: అయ్యప్ప మాలధారులకు సద్ది ఏర్పాటులో దాతల చొరవ, స్వామి పట్ల వారి భక్తి ఎనలేనిదని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. గణపవరం కుప్పగంజివాగు సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన తాత్కాలిక షెడ్డులో ఏర్పాటు చేసిన బిక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. మాలధారులకు బిక్షను వడ్డించారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజల అనంతరం బిక్ష ఏర్పాటుకు ఆర్థికసాయం అందించిన దాతలు అంబటి రామూర్తి, తోట శివరామకృష్ణ, చేబ్రోలు రామస్వామి దంపతులను శాలు వాలతో సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు తులం పూర్ణచంద్రరావు, సిద్ధు హనుమంతరావు, మాదినేని చంద్రమౌళి, చక్రవరం శివన్నారాయణరాజు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, ఆలయ కమిటీ సభ్యులు మండలనేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు ఉన్నారు.




గణపవరం అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

బీసీ ఉద్యోగులు పెన్షనర్స్ మహాసభకు తరలిరండి

నరసరావుపేట: ఈనెల 13న విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే బీసీ ఉద్యోగులు పెన్షనర్స్ రాష్ట్ర మహాసభకు ఉద్యోగులు, పెన్షనర్స్ హాజరు కావాలని పల్నాడు జిల్లా బీసీ ఉద్యోగుల జేఏసీ సభ్యులు ఏఏ.మధుకుమార్, బండిరాము, రామారావు, బత్తుల లక్ష్మయ్య, విజయభాస్కర్, రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జనాభాలో 57 శాతం ఉన్న బీసీలు ఆర్థికంగా, సామాజికం, రాజకీయంగా వెనుకబడిన ఉన్నారని. దీనికి ప్రధాన కారణం ఐక్యత చైతన్యం లేకపోవడమే అన్నారు. దీనివలన బీసీలు అనేక ప్రయోజనాలు కోల్పోతున్నారని, ఇటువంటి సభలకు హాజరవడం ద్వారా మన ప్రయోజనాలు కాపాడబడతాయని తెలియజేశారు. ఈసభ ద్వారా బీపీ మండల్ సిఫార్సు అమలు చేయాలని, బీసీలకు రక్షణ చట్టం, క్రిమిలేయర్ రద్దు చేయాలనే డిమాండ్లు ప్రభుత్వానికి చేయటం జరుగుతుందన్నారు. ఈసభకు హాజరయ్యే వారు 83284 14008, 94915 03406 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రెండు రోజుల్లో అందుబాటులోకి యూరియా

నరసరావుపేట రూరల్: రెండు,మూడు రోజుల్లో రైతులకు సరిపడా యూరియా అందుబాటులోకి వస్తుందని సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కె.వి.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కొండకావూరు, పమిడిమర్రు గ్రామాల్లో గురువారం యూరియాపై అవగాహన సదస్సులు నిర్వహించారు. రైతులతో ముఖాముఖి నిర్వహించి యూరియా కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ యూరియా గురించి రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. రైతులకు అవసరమైన యూరియా రెండు రోజుల్లో వస్తుందని తెలిపారు. యూరియాకు బదులుగా నానోయూరియా ఉపయోగించాలని సూచించారు. దీని వలన గాలి కాలుష్యం తగ్గుతుందని తద్వారా పంటలకు ఉపయోగపడే కీటకాలు నశించకుండా ఉంటాయని తెలిపారు. రైతులు సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఏఓ ఐ.శాంతి తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాసరావు

బొగ్గు లారీ పట్టివేత

వినుకొండ: ఎలాంటి అనుమతులు లేకుండా సరఫరా అవుతున్న బొగ్గు లారీని వినుకొండ ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. వినుకొండ రూరల్ మండలం చాట్రగడ్డపాడు సమీపంలో అనుమతులు లేకుండా బొగ్గు లోడ్ చేసిన లారీని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఫారెస్ట్ అధికారి మాధవరావు తెలిపారు.

గొప్ప దార్శనీకుడు సీతారాం ఏచూరి

మాచర్ల రూరల్: కార్మిక, కర్షక, శ్రామిక, అణగారిన వర్గాల అభ్యున్నతికి పార్లమెంట్‌లో గొంతెత్తి నినదించి, తన వాదన పటిమతో ప్రత్యర్థి నాయకుల మెప్పును పొందిన గొప్ప దార్శనికుడు సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆంజనేయులు నాయక్ గురువారం అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయుల్ నాయక్ మాట్లాడుతూ సీతారం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. స్థానిక నాయకులు బండ్ల మహేష్, వై.సురేష్, వెంకటరత్నం, వేముల వెంకట్రావు తదితరులున్నారు.

రాష్ట్ర టెన్నికాయిట్ జట్టుకు నకరికల్లు విద్యార్థులు



నకరికల్లు: రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ చాంపియన్షిప్ పోటీలకు నకరికల్లు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు తెలిపారు. కోనసీమ జిల్లా మండపేటలో ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టులో నకరికల్లు ఉన్నత పాఠశాలకు చెందిన బెల్లంకొండ వైశాలి, దేశినేటి కోటేశ్వరరావు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జిల్లా జట్టులో స్థానం పొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయునితో పాటు క్రీడా ఉపాధ్యాయురాలు జి.ఝాన్సీరాణి, విద్యాకమిటీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు తదితరులు అభినందనలు తెలిపారు.

15 నుంచి ఉచిత యోగా శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగా సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15వతేదీ సోమవారం నుంచి 28 రోజుల పాటు 189వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు శాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకట జనార్ధన్ గురువారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో శిబిరం కొనసాగుతుందని వివరించారు. శిబిరంలో 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు బోధిస్తామన్నారు.

మందుబాబుల ఆగడాలు

వినుకొండ: పట్టణంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద మందుబాబులు కత్తితో హల్‌చల్ చేసి కొందరిని గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 9న అశోక్ అనే వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. అతనితో పాటు అతని సన్నిహితుడు రామకృష్ణ (బచ్చన్) వీరి మీద గతంలో కేసులు ఉన్నట్లు సమాచారం. కత్తితో హల్‌చల్ చేసి సమీపంలో ఉన్న ఇరువురిని గాయపరిచారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నరసరావుపేట రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం ఆర్థిక సాయం అందజేశారు. వినుకొండ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ కె.వెంకటసుధాకర్ ఈ ఏడాది మే 22వ తేదీన మృతిచెందాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మృతుడి భార్య ఉమాదేవికి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. హోంగార్డులు ఒక్కరోజు వేతనంతో ఈ ఆర్థిక సాయం అందజేసినట్టు ఎస్పీ తెలిపారు. సహా ఉద్యోగి కుటుంబానికి సాయం చేయడానికి ముందుకు వచ్చిన హోంగార్డులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, హోంగార్డు ఆర్ఐ ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అడిగొప్పల అమ్మవారికి కుంకుమ బండి

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు రెడ్డిపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లు మధుసూధనరెడ్డి గురువారం అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారికి కుంకుమ బండి కట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) కుంకుమ బండికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అడిగొప్పల చేరుకున్న అనంతరం కూడా పీఆర్కే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెదకొదమగుండ్ల మాజీ సర్పంచ్‌లు మందాళ్ల అంజిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, అల్లు వెంకటేశ్వరరెడ్డి (యూత్), అంబటి శ్రీనివాసరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, జక్కిరెడ్డి నాగిరెడ్డి, జెడ్డా కోటిరెడ్డి, అన్నపరెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెంకటేశ్వరరెడ్డికి ఘననివాళి..

వెల్దుర్తి: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన మందా సీతారామిరెడ్డి తండ్రి వెంకటేశ్వర రెడ్డి దశదిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం పాల్గొని వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, రెంటచింతల మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేకల కోటిరెడ్డి, కుర్రా పోతురాజు, నర్రా మల్లయ్య, ఇందేలా గంగాధర్ రెడ్డి, కర్పూరపు కోటిరెడ్డి, సింగాల విజయరాజు పాల్గొన్నారు.

నానో డీఏపీ ఎంతో మేలు

మండల వ్యవసాయ అధికారి కె.లక్ష్మారెడ్డి

పాలువాయిగేటు(రెంటచింతల): నానో యూరియా, నానో డీఏపీపై మండలంలోని పాలువాయి గేటు గ్రామ రైతులకు గురువారం అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి కట్టా లక్ష్మారెడ్డి తెలిపారు. నానో యూరియాను పంటల ఆకులపై పిచికారీ చేయడం వలన సాంప్రదాయ యూరియా కన్నా ఎక్కువ సమర్థవంతంగా పనిచేయడంతో పాటు పర్యావరణ హితమైందన్నారు. ఈ యూరియా వలన మొక్కలు పోషకాలను అధికంగా గ్రహిస్తాయన్నారు. దీంతో వ్యవసాయ రసాయనాల వినియోగం తగ్గుతుందని రైతులకు రవాణా, నిల్వ, ఖర్చులు కూడా ఆదా అవుతాయన్నారు. ఈ యూరియాను ఉదయం, సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాల న్నారు. నానో డీఏపీలో నత్రజని, భాస్వరం ఉంటాయన్నారు. నానో డీఏపీతో మొక్కలు అధిక పోషకాలు గ్రహించడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని, పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందని, సులువుగా రవాణా, నిల్వ చేసుకోవడం ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. నానో డీఏపీ ద్రవ రూపంలో ఉంటుందని విత్తనాలకు వాడే సమయంలో దీన్ని విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టి ఆపై విత్తుకోవాలన్నారు. నానో డీఏపీని తగినంత నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రంలో ఎంపీఈఓ రాంబాబు, ఏఈఓ వర్మ, రైతులు పాల్గొన్నారు.



నానో డీఏపీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మారెడ్డి

సాతులూరులో ఆక్రమణల తొలగింపు

- చందవరం సెంటర్ నుంచి రెడ్డిపేరంటాలమ్మ ఆలయం ..
- ఎన్టీఆర్ విగ్రహం నుంచి కూరగాయల మార్కెట్ వరకూ తొలగింపు

నాదెండ్ల: మేజర్ పంచాయతీ సాతులూరు గ్రామంలో ఆక్రమణల తొలగింపునకు పంచాయతీ అధికారులు ఉపక్రమించారు. గడిచిన నాలుగు రోజులుగా గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై చందవరం సెంటర్ నుంచి రెడ్డిపేరంటాలమ్మ ఆలయం వరకూ, ఎన్టీఆర్ విగ్రహం నుంచి కూరగాయల మార్కెట్ వరకూ ఆక్రమణల తొలగింపు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఎలాంటి ఆక్రమణలు ఉన్నా ఉపేక్షించేది లేదని, నిబంధనల మేరకు తొలగిస్తామన్నారు. సచివాలయ సర్వేయర్లతో ముందుగా సర్వే చేయించి హద్దు రాళ్ళను నిర్ణయించారు. దీని ప్రకారం ఆక్రమణల తొలగింపు చేస్తున్నారు. మరో రెండురోజుల్లో పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించి అవసరమైన చోట సైడు కాల్వలతో పాటూ కల్వర్టులు నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలు, రోడ్లు ఆక్రమించుకున్న వారికి ఇప్పటికే నోటీసులు అందించామని, సచివాలయ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించామని వివరించారు. హద్దులు నిర్ణయించి ఆక్రమణలను తొల గిస్తున్నామని, త్వరలో సైడు కాల్వలు, కల్వర్టులు నిర్మిస్తామని రాఘవయ్య తెలిపారు.



సాతులూరులో ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

విశ్వశాంతి వేడుకలు విజయవంతం చేయండి

మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొండ్రముట్ల రుద్రమచారి

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 17న జరగనున్న శ్రీవిరాట్ విశ్వకర్మ విశ్వశాంతి యజ్ఞ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కొండ్రముట్ల రుద్రమచారి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని విశ్వ బ్రాహ్మణులను స్వయంగా కలిసి కరపత్రాలు పంపిణీ చేశామని ఈ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే గత 8 సంవత్సరాల నుంచి అందరి సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈఏడాది నూతన కార్యవర్గం సభ్యులు ఏర్పాటు చేశామని వారందరి ప్రోత్సాహంతో వేడుకలు విజయవంతమయ్యేలా కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు తువ్వపాటి యలమంద చారి, విక్కుర్తి రామబ్రహ్మాచారి, తాటికొండ హరిబాబు, కోటరాజా చంద్రమౌళి, ఆముదాలపల్లి రాంబాబు, మాజీ అధ్యక్షులు పులుకూరి సురేష్, శ్రీనివాసరావు ఉన్నారు.

ట్రైబల్ స్కూల్లో ఎంఈఓ తనిఖీ

శావల్యాపురం: స్థానిక ట్రైబల్ స్కూలును ఎంఈవో మద్దికుంట సాంబశివరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అందిస్తున్న వసతులు పారదర్శకంగా అందించాలని అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో కీలకపాత్ర పోషించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును విద్యార్థులు సామర్థ్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయురాలు చెంచులక్ష్మి ఉన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన



వినుకొండ : పట్టణంలోని పీఏసీఎస్, మన గ్రోమోరు, ఎరువుల షాపులను మండల వ్యవసాయాధికారి జి.వరలక్ష్మి తనిఖీ చేశారు. దీనిలో భాగంగా రైతులకు యూరియా గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరం మేరకు మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని తెలిపారు. రెండవ దఫా ఎరువుల వాడకంలో నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వాడకం అలవాటు చేసుకోవాలని, తద్వారా వాతావరణం కలుషితం కాకుండా కాపాడుకోవచ్చన్నారు.

